ప్రజాశక్తి
ఆదివారం 25 ఫిబ్రవరి 2024
5
కర్నూలు





మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ఉపాధి కింద పనుల కల్పన : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వివరించారు. శనివారం విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువులు , కాలువల పూడిక తీత పనులను పూర్తిగా తగ్గించి మిగిలిన పనులను చేపట్టేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవి సందర్భంగా కూలీలందరికీ పనులు కల్పించడంతో పాటు యావరేజ్ హౌజ్ హోల్డ్స్ సంఖ్య పెంచడం పై ప్రత్యేక దృష్టి పెట్టామని కలెక్టర్ వివరించారు. రీ సర్వేకు సంబంధించి పనులు పురోగతి కానున్నాయని, స్టోన్ ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేస్తామని, అందుకు సంబంధించిన నివేదిక పంపుతామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య , మున్సిపల్ కమిషనర్ భార్గవ్ డిఆర్ఒ మధుసూదన్ రావు , పిఆర్ఎస్ఇ సుబ్రమణ్యం , ఎస్ఇ ఇరిగేషన్ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఇ నాగేశ్వర రావు ,హౌసింగ్ పిడి సిద్దలింగమూర్తి , సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, డిఆర్‌డిఎ పిడి అమర్నాథ్ రెడ్డి, డిఎంహెచ్ఒ రామ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-2 పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో ఆదివారం నాడు గ్రూప్ 2 అర్హత పరీక్ష జరుగుతుంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 126 పరీక్ష కేంద్రంలో దాదాపుగా 36000 మంది అభ్యర్థులు హాజరు కాలున్నారు. ఈ పరీక్ష ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుంది.

ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరా ఏర్పాటు

ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగే ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరా ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్‌బాష పేర్కొన్నారు. శనివారం నగరంలోని స్థానిక ప్రభుత్వ టౌన్‌మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డిఇసి సభ్యులు లాలప్ప పరమేశ్వర్ రెడ్డి,సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ టు సర్వీస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్‌టిసి బస్సులు

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు ప్రజా రవాణా ద్వారా గ్రూప్ టు పరీక్షలు రాసే విద్యార్థుల కోసం 25వ తేదీ ఆదివారం బస్సులను ఏర్పాటు చేయాలని కర్నూలు ప్రజా రవాణా అధికారి శ్రీనివాసు లు డిపో మేనేజర్‌లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయంలలో పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

తొలి జాబితాలో తొమ్మిది మంది

- అభ్యర్థులను ప్రకటించిన టిడిపి, జనసేన - మిగిలిన స్థానాలపై ఉత్కంఠ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



బొగ్గుల దస్తగిరి | టిజి.భరత్ | కెఇ.శ్యాంబాబు | కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి



బీసీ.జనార్ధన్‌రెడ్డి | గౌరు చరితారెడ్డి | బుడ్డా రాజశేఖర్‌రెడ్డి | ఎస్‌ఎండి ఫరూక్ | భూమా అఖిలప్రియ

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను శనివారం ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఆళ్లగడ్డ టికెట్‌ను భూమా అఖిలప్రియకు, శ్రీశైలం టికెట్‌ను బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, కర్నూలు టికెట్‌ను టిజి.భరత్‌కు, పాణ్యం టికెట్‌ను గౌరు చరితారెడ్డికి, నంద్యాల టికెట్‌ను ఎన్‌ఎండి.ఫరూక్‌కు కేటాయించారు. బనగానపల్లె టికెట్‌ను బీసీ.జనార్ధన్ రెడ్డికి, డోన్ టికెట్‌ను కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డికి, పత్తికొండ టికెట్‌ను కెఇ.శ్యాంబాబుకు, కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ టికెట్లను ఆయా నియోజకవర్గాల టిడిపి సమన్వయకర్తలకే కేటాయించారు. డోన్‌లో గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్యాపిలి మండలం జలదుర్గం బాదుడే బాదుడు సభలో ధర్మవరం సుబ్బారెడ్డిని టిడిపి అభ్యర్థిగా ప్రకటించారు. ఆయనను గెలిపించాలని కోరారు. ధర్మవరం సుబ్బారెడ్డి స్థానంలో కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డిని తొలి జాబితాలో అభ్యర్థిగా ప్రకటించారు. ధర్మవరం సుబ్బారెడ్డి అయోమయంలో పడ్డారు. కోడుమూరు టికెట్‌ను కొత్తగా బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మిగిలిన స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఆదోనిలో నియోజకవర్గ సమన్వయకర్త మీనాక్షి నాయుడుతో పాటు చాలా మంది టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆలూరులో నియోజకవర్గ సమన్వయకర్తగా కోట్ల సుజాతమ్మ ఉన్నారు. తాజాగా డోన్ టికెట్‌ను కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి ప్రకటించడంతో ఆలూరు స్థానం ఎవరికి కేటాయిస్తారోనన్న సందిగ్ధం నెలకొంది. ఇంటికి ఒకే టికెట్ అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించడంతో ఆలూరు స్థానం కోట్ల సుజాతమ్మకు కాకుండా ఇతరులకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రాలయం టికెట్ ఇప్పటికే నియోజకవర్గ సమన్వయకర్త ప్యాలకుర్తి తిక్కారెడ్డికి ఖరారైనట్లు సమాచారం. రెండో జాబితాలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎమ్మిగనూరులో నియోజకవర్గ సమన్వయకర్తగా బివి.జయనాగేశ్వరరెడ్డి ఉన్నారు. దాదాపు ఆయనకే టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. నందికొట్కూరు స్థానానికి సంబంధించి ఎవరికి కేటాయిస్తారోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

దళితులకు భూమి హక్కు కల్పించాలి

- ఎస్‌సి కమిషన్ చైర్మన్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మండలం మునగాలపాడు గ్రామ పరిధిలో కెసికెనాల్ కింద దళితులు 100 సంవత్సరాలకు పైగా సాగు చేసుకుంటూ బతుకుతున్న భూములను ప్రభుత్వం పేరుతో అన్యాక్రాంతం చేసుకోకుండా ఆపాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఆనంద్ బాబు అమరావతిలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను శనివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరానికి అతి సమీపంలో ఉన్న మునగాలపాడు గ్రామ పరిధిలో సర్వే నంబర్ 46సి, 50, 71 తోపాటు 236 నుండి 433 వరకు ఉన్న భూములలో 60 కుటుంబాల దళితులు తాతల తండ్రుల నాటి నుండి సాగు చేసుకుంటూ బతుకుతున్నారన్నారు. కర్నూలు మంచినీటి సమస్య పరిష్కారం కోసం గతంలోనే 15 ఎకరాలు దళితుల భూమిని స్వాధీనం చేసుకొని మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారన్నారు. దాని పక్కనే ఉన్న రైతుల భూముల్లో కెసి కెనాల్ నుండి నీళ్లను పైపు ద్వారా వదిలి భూమిని పంటకు పనికిరాకుండా చేసి ఆ భూమిని సైతం ఇప్పటికే లాక్కున్నారన్నారు. దీనికి తోడు ఇప్పటికే పంట పొలాలు ఉన్న వాటిని సైతం ఖాళీ చేయాలంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అవసరం కోసం అంటూ కెసి కెనాల్‌కు 200 అడుగుల దూరంలో ఉన్న భూమిని లాక్కుంటున్న అధికారులకు కెసి కెనాల్ కు ఆనుకునే 20 అడుగుల దూరంలో ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకున్న భూమి కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు.కెసి కెనాల్ పక్కన బోటింగ్ షికారు కేంద్రాన్ని ఏర్పాటు చేస్థామని చెబుతున్నట్లు దళితులు తెలిపారని, ఆ షికారు కేంద్రం ఏర్పాటు, వాటి పక్కన భూములు కొనే వాటికి రేట్లు పెంచుకోవడం కోసం మాత్రమేనని వారు తెలిపారు. దళితుల భూములను బలవంతంగా లాక్కుంటే అట్రాసిటీ వర్తిస్తుందని, భూములు లాక్కుంటున్నా అధికారులపై కేసులు నమోదు చేసి, 100 సంవత్సరాలుగా అదే భూములపై బతుకుతున్న వారి పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించి హక్కు కల్పించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరసన గళం...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ నిరసన గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోఏఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్య కార్యాచరణ సమితిలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. కర్నూలులో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. అంతకు ముందు జిల్లా పరిషత్ నుంచి రాజ్ విహార్, బుధవార పేట మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్, 11వ పిఆర్‌సి, డిఎ బకాయిలు పేరిట రూ.30వేల కోట్ల మేరకు పెండింగులో ఉన్నాయని, తక్షణమే వాటిని చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ వేసినప్పటికీ అమలు కానందున నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోయిన కారణంగా వెంటనే 30 శాతం మధ్యంతర భృతి (ఐ.ఆర్)ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 70 ఏళ్ల వారికి 10శాతం, 75 పై బడ్డ వారికి 15 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భానుడి భగభగ..

ఫిబ్రవరి నెల ముగియకముందే భానుడు భగభగ అంటూ ప్రతాపం చూపుతున్నాడు. ఎండలు దంచి కొడుతుండడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. బయటికి వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం మొదలవుతోంది. గత మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండలు ఫిబ్రవరి నెలలోనే అమాంతంగా పెరిగిపోవడంతో మార్చి, ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. రేపటి నుంచి ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువ నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్థికంగా బలపడిన కుటుంబాలు ఎండ తాకిడిని తట్టుకోలేక ఇంటి దగ్గర ఉన్నా గడిచిపోతుంది. చిన్న పరిశ్రమల కార్మికులు, ఉపాధి హామీ పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. చిన్న పరిశ్రమల యాజమాన్యం, ఉపాధి హామీ అధికారులు ఎండ వేడి నుంచి కార్మికులను, కూలీలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవీ..ఇవీ..అన్నీ..

కర్నూలు నగరంలోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ స్మారక పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంఒ సైన్స్ జాతా నిర్వహించారు. విద్యార్థులకు పాటలు, డ్యాన్స్‌లు, స్కిట్స్ ద్వారా మూఢనమ్మకాలు, విద్య, వైద్యం, లౌకిక తత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం - ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంశంపై సదస్సును లలితకళాసమితిలో నిర్వహించారు. బిజెపిని, దానికి మద్దతిచ్చే పార్టీలను ఓడించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ఆర్థికసాయం జమ చేశారు.



ఇవిఎంల రాండమైజేషన్ అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఇవిఎంల రాండమైజేషన్ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని ఆర్ఒలు, ఎఇఆర్‌ఒలకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వివరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలకు ఇవిఎంల మొదటి విడత రాండమైజేషన్ (డ్రైరన్) పై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఇవిఎం రాండమైజేషన్ ఇఎంఎస్ వెబ్‌సైట్‌లో చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ఇవిఎం వేర్‌హౌస్ నుంచి వెబ్‌సైట్‌లో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు 20 శాతం బఫర్‌గా వెళ్లడం ద్వారా మొదటి విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. రెండవ విడత ఇవిఎం రాండమైజేషన్ నియోజకవర్గ స్థాయిలో అబ్జర్వర్, ఆర్ఒ, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో చేయడం జరుగుతుందన్నారు. అందుకు ఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలకు కర్నూలు పార్లమెంటు, జిల్లాలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, నంద్యాల పరిధిలోని పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇవిఎం రాండమైజేషన్‌పై అవగాహన కల్పించి ట్రైల్‌రన్ నిర్వహించడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

సంబరాల్లో గౌరుచరిత అనుచరులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



గౌరు చరితకు తొలి జాబితాలో పాణ్యం అభ్యర్థిగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో పాణ్యం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల శనివారం సంబరాలు చేసుకున్నారు. గౌరు స్వగృహం మాధవి నగర్ నుండి అమ్మ హాస్పిటల్ సర్కిల్ వరకు టిడిపి శ్రేణులు ర్యాలీగా వెళ్లి, బాణ సంచా పేల్చారు. కేకులు, స్వీట్లు పంచుకుంటూ ఆనందోత్సవ వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, కల్లూరు మండలం అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మండల నాయకుల్, తదితరులు పాల్గొన్నారు.

ఉలిందకొండలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌరుచరిత రెడ్డిని ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉందని గ్రామ నాయకులు ఇవి రమణ అన్నారు. రమణ ఆధ్వర్యంలో సుంకులమ్మ గుడిలో పూజ చేసి బాణసంచా పేల్చి ఒకరికి ఒకరు స్వీట్లు పంచుకొని సంబరాలుచేసుకున్నారు. స్థానిక నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటిపై శ్రీధర్‌రెడ్డి అనుచరుల దాడి

సంఘీభావంగా ఎమ్మెల్యే కాటసానిని కలిసిన సహచర కార్పొరేటర్లు

జిజిహెచ్‌లో ఎమ్మెల్సీ చేసి చికిత్స పొందిన బాధితుడు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 28వ వార్డు కార్పొరేటర్ ఇ.నారాయణరెడ్డి ఇంటిపై పెద్దపాడు మాజీ సర్పంచి సిద్ధారెడ్డి శ్రీధర్ రెడ్డి డ్రైవర్ అనుచరులు శనివారం ఉదయం దాడి చేశారు. ఈ దాడిలో కార్పొరేటర్ నారాయణరెడ్డి ఆయన అన్న ఇ. శేషారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. కార్పొరేటర్ ఇంటిపై దాడి జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న సహచర కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మి కాంతారెడ్డి, ఎం.చిన్న నరసింహులు, గాజుల శ్వేతా రెడ్డి కార్పొరేటర్ వైజా అరుణ బాలచంద్రారెడ్డి, మిద్దె చిట్టమ్మ భర్త ఎం.తిరుపాలు, సపూరి మాధురి తండ్రీ సాపూరి వీరయ్య కార్పొరేటర్ నారాయణరెడ్డి అతని అన్న శేషారెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే కాటసాని ఇంటి వద్దకు వెళ్లి సంఘటనను వివరించారు. ఒక కార్పొరేటర్ ఇంటిపై దాడి చేయడం చాలా దారుణం బాధాకరం అని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం కార్పొరేటర్ నారాయణరెడ్డి అతని అన్న శేషారెడ్డి జిజిహెచ్‌లో చేరి ఎంఎల్సి చేయించుకుని కేసు నమోదు చేశారు. గాయాలు తీవ్రంగా ఉండటంతో ఎక్స్‌రేలు, సిటి స్కాన్లు తీయించుకుని డిచార్జ్ చేసుకుని ఇంటికి వెళ్లారు.

ఎమ్మెల్యే కాటసాని ఇలాఖాలో ముఠాపోరు

కార్పొటర్ ఇంటిపై దాడికి ముందు శుక్రవారం 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో జరిగిన సుంకులమ్మ దేవర కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు పెదపాడు శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, శ్వేతా రెడ్డి తమ తమ వాహనాలలో వెళ్లారు. కాన్వాయ్‌లో వెళ్తున్న శ్రీధర్ రెడ్డి వాహన డ్రైవర్ శ్వేతా రెడ్డి వాహనాన్ని ఢీకొట్టే ప్రయత్నం చేశారు. ఈ సంఘటనలో కార్పొరేటర్ నారాయణరెడ్డి అతని అన్న శేషారెడ్డి డ్రైవర్ను తీవ్రంగా మందలించారు. దీన్ని మనసులో ఉంచుకున్న వాహన డ్రైవర్ 15 మంది తన అనుచరులను తీసుకువచ్చి నారాయణరెడ్డి ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడి మొదటిది కాదు మూడవసారి నారయణరెడ్డి తెలిపారు. కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి ఎమ్మెల్యే కాటసాని కాన్వాయ్‌లో నేను వెళుతుండగా శ్రీధర్ రెడ్డి వాహన డ్రైవరు అటాక్ చేయడం ఇది మూడవసారి అన్నారు. ఇప్పటికే రెండుసార్లు నా వాహనంపై దాడికి ప్రయత్నించారన్నారు. దీనికి కారణం ఎమ్మెల్యే సీటు తనకు కావాలని కోరుతూ సీఎం జగన్ రెడ్డిని కలవడమే కారణంగా భావిస్తున్నాను. దీనిని మనసులో పెట్టుకుని తనను భయభ్రాంతులకు గురి చేసే క్రమంలో మూడవ పర్యాయం జరిగిన సంఘటన తన మనసును కలచి వేసింది.

'బిఎన్‌ఎస్ ' చట్టం అమలుకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

డ్రైవర్లకు ఉరితాడు లాంటి భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) ఎపిపిటిడి ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, కడప జోన్ అధ్యక్షులు ఆర్.అజీమ్ ఖాన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ సత్యరాజు, వివిఎస్ రాయుడు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. బిఎన్‌ఎస్ చట్టంతోపాటు మరో రెండు చట్టాలను 2024 జులై 1 నుంచి అమలు కోసం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం, కొత్తగా అమలులోకి వచ్చిన మూడు నేర న్యాయ చట్టాలు జూలై 1, 2024 నుండి అమలులోకి వస్తే రవాణా రంగ అసోసియేషన్లకు గతంలో ఇచ్చిన హామీకి భిన్నంగా కేంద్రం ఈ చర్యకు పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటులో శీతాకాల సమావేశాలలో ఏకపక్షంగా 2023 డిసెంబర్ 21వ తేదీన ప్రతిపక్ష సభ్యుల గైరు హాజరు (సస్పెండ్ చేసి) లో ఆమోదించిందన్నారు. 2023 డిసెంబర్ 25న రాష్ట్రపతి ఆమోదం తెలిపారన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా 2024 జనవరి మొదటి వారంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ట్రక్కు డ్రైవర్లు మెరుపు సమ్మెలను నిర్వహించారు. ఈ సందర్భంగానే బిఎన్‌ఎస్ చట్టంపై అసోసియేషన్లతో సంప్రదించిన తర్వాతనే అమలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీకి భిన్నంగా నేడు ఏకపక్షంగా అమలుకు పూనుకోవడం నియంతృత్వ చర్యకు పరాకాష్ట అవుతుందన్నారు. ఫిబ్రవరి 16న బిఎన్‌ఎస్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా రవాణా రంగ కార్మికులు సమ్మె చేశారు. అయినప్పటికీ అమలు కోసం నోటిఫికేషన్ జారీ చేయడం అత్యంత దురదృష్టకరం! ఈ నిరంకుశ చర్యలను వ్యతిరేకిస్తూ బిఎన్‌ఎస్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో పోరాటాలను ఉదతం చేస్తామని హెచ్చరించారు.

నేడు 'సాక'పరిచయసభ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

2022 -దళిత కథా వార్షిక 'సాక' పరిచయసభ టిజివి కళాక్షేత్రం కర్నూలులో ఈనెల 25 ఆదివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కర్నూలు కవులు, రచయితల సమన్వయకర్త జంధ్యాల రఘుబాబు తెలిపారు. ఇనాయతుల్లా సభాధ్యక్షతన జరుగే ఈ సభలో జంబూ సాహితీ సంపాదకులు డాక్టర్ సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్ , తప్పెట ఓదయ్యలు అతిథులుగా పాల్గొంటారన్నారు. దళిత కథ స్వరూప స్వభావాలను ఆలకించగలరని, ఈ పరిచయ సభలో వక్తలుగా రాయలసీమ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకులు డాక్టర్ అరుణ, పాణి, జి వెంకటకృష్ణ లు కథల అంతసారాన్ని విశదీకరిస్తారన్నారు. దళితుల బాధలు గాథలుగా మారిన వైనం కన్నీళ్లు దూసిన కత్తుల కోలాటం, చేదు రుచుల్ని మధురంగా మార్చుకోవడమెలాగో తెలిపే విషవలయం , వికాసం, అవమానాల పరంపరలో బతుకు సందేశం ఇచ్చే సన్మానం లాంటి కథలు దళిత కథలుగా ఈ సంకలనంలో ఉన్నాయన్నారు. త్యాగాల తోరణం అయి అర్పించిన సాక కథల లోతుల్ని వినేందుకు మేధావులు, కవులు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు హాజరవ్వాలని కోరారు.



నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రజారోగ్య వేదిక, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 25న ఆదివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఇందిరా గాంధీనగర్ లోని సుందరయ్య భవన్లో జిబిఆర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ కె.ప్రభాకర్ రెడ్డి, కన్వీనర్ జెఎన్ .శేషయ్యలు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బిపి ,షుగర్ ,పక్షవాతం, ఫిట్స్ (మూర్ఛ) జబ్బులకు మాత్రమే వైద్యం అందిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ, డాక్టర్ ఎం.నాగభూషణరావు, డాక్టర్. వినోద్, డాక్టర్ కె.సంధ్య, డాక్టర్ జయకృష్ణ, డాక్టర్. పర్వీన్‌ల వైద్యబృందం వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చేవారు ముందుగానే బిపి ,షుగర్ పరీక్షలు చేయించుకుని వాటి రిపోర్టులు తీసుకొని రావాలన్నారు. ఆ రిపోర్టుల ఆధారంగా రూ.200కే రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తామని తెలిపారు. కర్నూలు నగరంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సంప్రదించవలసిన నెంబర్లు: 9490098748, 9703923473, 9030257513.




నాటుసారా స్థావరాలపై విస్తృతదాడులు

-గుడుంబాయి తండాలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్

-భారీ ఎత్తున నాటు సారా బెల్లం గుట ధ్వంసం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు కర్నూలు సెబ్ఎన్ ఫోర్స్ మెంట్ ఇన్‌ఛార్జి అడిషనల్ ఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మండలం - గుడుంబాయితండా వద్ద సెబ్ టీం, ఓర్వకల్ పోలీసులు కలిసి కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గుడుంబాయి తండా నుండి ఇతర ప్రదేశాలకు నాటుసారా సరఫరా చేస్తున్నారన్న సమాచారం రావడంతో శనివారం ఈ దాడులు చేశారు. ఈ దాడులలో 3,600 లీటర్ల నాటు సారా ఊట బెల్లం ధ్వంసం చేశారు. 100 లీటర్ల నాటు సారాను , 250 కిలోల బెల్లంను స్వాధీనం చేసుకుని ఓర్వకల్లు పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే నాటుసారా జోలికి వెళ్ళి, ఎవరైనా నాటుసారా తయారుచేసినా, విక్రయించినా అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ దాడులలో సెబ్ అధికారి వినోద్ కుమార్, ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


విరుపాక్షిని సన్మానిస్తున్న శ్రీనివాసులు

ఆలూరును జగన్‌కు కానుకగా ఇద్దాం

- వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రూపు విభేదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా వైసిపి అభివృద్ధికి కష్టపడి పని చేసి, ఆలూరు నుంచి వైసిపి జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి తెలిపారు. శనివారం ఆయన దేవనకొండ మండలంలో పర్యటించారు. ముందుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో వైసిపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని, గ్రామ నాయకులకే ప్రాధాన్యతను ఇస్తామని వెల్లడించారు. అందరూ పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి పనిచేయాలని కోరారు. కరివేముల గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం విద్యుదాఘాతంతో ఆస్తి నష్టం వాటిల్లిన కటిక మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం లక్కందిన్నె, ఐరన్‌బండ బి సెంటర్, గుమ్మరాళ్ల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో వైసిపి నాయకులను, ప్రజా ప్రతినిధులను కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ నియోజకవర్గ పరిశీలకులు తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, హంపి రెడ్డి, నిజాలు రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, దివాకర్ నాయుడు, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, ఐరన్‌బండ సర్పంచి నరసింహస్వామి, ఎల్‌కె.శ్రీనివాసులు, తిరుమలేష్ నాయుడు, వైసిపి మైనార్టీ గౌరవాధ్యక్షులు యూసుఫ్ బాష, వడ్డే ఉరుకుంద పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన

ప్రజాశక్తి - కౌతాళం


నిరసన చేపడుతున్న నాయకులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కౌతాళంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. శనివారం రైతు సంఘం ఉపాధ్యక్షులు మల్లయ్య మాట్లాడారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టం కోసం చేస్తున్న పోరాటానికి హర్యానాలో రైతులపై పోలీసులతో కాల్పులు జరిపించి, అందులో యువ రైతు మృతికి కారణమైన వారిని శిక్షించాలని కోరారు. చాలామందికి గాయాలయ్యాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించిన తీరును నిరసిస్తూ కౌతాళంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

ఆశావర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డి కోరారు. శనివారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆశావర్కర్లకు ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్, దహన సంస్కారాలకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో 25న జరిగే ఆశావర్కర్స్ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తెలిపారు. సిఐటియు మండల ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- వైస్ ఎంపిపి ముత్తమ్మ

ప్రజాశక్తి - పెద్దకడుబూరు


పూజలు చేస్తున్న నాయకులు

మండలంలోని చిన్న తుంబలం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వైస్ ఎంపిపి ముత్తమ్మ తెలిపారు. శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో నీటి సమస్య పరిష్కారానికి జలజన మిషన్ పథకం ద్వారా చిన్నతుంబలం గ్రామంలో మూడు బోర్లు వేయించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చడానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె తెలిపారు. ఎల్లప్ప, బ్రహ్మయ్య, నీటి సంఘాల అధ్యక్షులు లింగన్న గౌడ్, సోమప్ప ధని, మదిరే రాముడు, బ్రహ్మయ్య, వీరేష్, గంగాధర్, రమేష్, రాముడు, ప్రభుదాసు, నరసింహ ఆచారి, కురువ మల్లయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎన్నికల విధి నిర్వహణలో ప్రతి అధికారీ అప్రమత్తంగా ఉండాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి, వివిటి, విఎస్‌టి టీములతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల విధులు నాణ్యతతో నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, డిప్యూటీ తహశీల్దార్ రజినీ కాంత్ రెడ్డి, డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, ఇన్‌ఛార్జీ విజయ శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

తాగు, సాగునీరందాలంటే టిడిపి రావాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం


గ్రామాలకు తాగు, సాగునీరు అందాలంటే కచ్చితంగా టిడిపి అధికారంలోకి రావాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మాచాపురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా సమస్యలు వెల్లువెత్తుతున్నాయని, సమస్యలతో గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. మురుగు కాలువల నుంచి రోడ్లపై నీరు ప్రవహిస్తున్నా, వైసిపి నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సర్పంచులకు నిధులు ఇవ్వకపోవడంతో, గ్రామాల అభివృద్ధి మరుగున పడిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కోవాలని, ఈ వైసిపికి మరోసారి ఓటు వేస్తే గ్రామాలు మరో 20 ఏళ్ల వెనుకబాటు తనానికి గురవుతాయని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు ఖాసీం వలీ, గురురాజ్ దేశాయి, వెంకటరాముడు, మిట్టా సోమాపురం వీరేష్, ఆదిశేషు, బడేసాబ్ వలీ, మాబు హుస్సేన్ పాల్గొన్నారు.


బీవీకి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆలయ కార్యనిర్వాధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య శనివారం అత్యంత వైభవంగా సాగింది. ఈ రథోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి, జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్, ఆలూరు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు తెర్నేకల్ సురేంద్ర రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సిఐ శ్రీనివాసులు పోలీసు బందోబస్తు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎంపిపి భర్త లుముంబా, వైసిపి నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, దివాకర్ నాయుడు, నిజాలు రెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, ఎల్‌కె.శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు


నిరసన తెలుపుతున్న నాయకులు

అలంకారప్రాయంగా ఐటిఐ కళాశాల

- టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం ఆరేకల్ వద్ద నాలుగేళ్ల క్రితం నిర్మించిన మైనార్టీ ఐటిఐ కళాశాల అలంకారప్రాయంగా ఉందని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు విమర్శించారు. శనివారం టిఎన్ఎస్ఎఫ్ అధ్వర్యంలో ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో ఉన్న మైనారిటీ ఐటిఐ కళాశాలను నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా భవనానికి తాళాలు వేసి పాడుబడిన భవనంలా మార్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి మైనారిటీ ఐటిఐ కళాశాలకు సిబ్బందిని నియమించి, సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేకపోతే మైనారిటీలను ఐక్యం చేసి వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు రమేష్, నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్య, మండల నాయకులు గణేష్, సాయి, నూర్, నాయకులు మహబూబ్, కిషోర్, సాయి, తాహేర్, ఇర్ఫాన్, అర్మాన్, సొహైల్, రమేష్, చిన్న, అభి, రాజు, రఘు, నవీన్, హేమంత్, రమేష్, మనోజ్, విష్ణు పాల్గొన్నారు.

26న చలో అనంతపురం : కాంగ్రెస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఈనెల 26న అనంతపురంలోని జూనియర్ కళాశాలా మైదానంలో జరిగే రాష్ట్ర పునర్నిర్మాణ పోరాట సభకు నియోజకవర్గ ప్రజలు తరలి రావాలని కాంగ్రెస్ ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా కాంగ్రెస్ ముందుకు రాబోతుందని తెలిపారు. ఈ సభకు పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిథిగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎఐసిసి కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. సభలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీలపై చర్చించనున్నట్లు చెప్పారు. మేనిఫెస్టోకు సంబంధించిన కొన్ని అంశాలపై ప్రత్యేక ప్రసంగం ఉంటుందన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయినాథ్, మద్దిలేటి, రామన్న యాదవ్, ఫరూక్ అహ్మద్, మాణిక్య రాజు, హనుమంతు పాల్గొన్నారు.

ఇవిఎంల పనితీరుపై అవగాహన

ఆదోనిరూరల్ : కలెక్టర్ డాక్టర్ సృజన, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశాల మేరకు ఇవిఎంల పనితీరుపై బిఎల్‌ఒలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. శనివారం ఆదోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లు తడబాటుకు గురికాకుండా యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, లేబర్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ గోపీనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ పాల్గొన్నారు.

బీసీ మహాసభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 25న కర్నూలు నగరంలోని ఎంఆర్‌సి ఫంక్షన్ హాలులో జరిగే 'జయహో బీసీ' మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కోరారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తిమ్మప్ప, దొడ్డనకేరి శివప్ప ఆధ్వర్యంలో శనివారం ఆదోనిలోని మీనాక్షి నాయుడు స్వగృహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు సూచనల మేరకు జరుగుతున్న 'జయహో బీసీ' మహాసభకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు, టిడిపి బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర హాజరవుతారని తెలిపారు. ఆరెకల్ రామకృష్ణ, గోనబావి గోపాల్, పాండవగల్లు అయన్న, గణేకల్లు విరుపాక్షి, సంతేకుడ్లూరు గోవిందప్ప, సోమన్న, రవి ప్రకాష్, ఎల్లప్ప పాల్గొన్నారు.


బీసీ నాయకులకు సూచనలు చేస్తున్న మీనాక్షి నాయుడు

టిడిపి అభ్యర్థిగా బీవీనే ప్రకటించాలి

- టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జున

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

టిడిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డినే ప్రకటించాలని టిడిపి మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున కోరారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మల్లికార్జున ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా బీవీ.జయనాగేశ్వర రెడ్డినే ప్రకటించాలని కోరారు. బీవీని కాకుండా వేరే ఎవరికి కేటాయించినా మండలంలోని అన్ని గ్రామాల టిడిపి గ్రామ కమిటీలు, బూత్ ఇన్‌ఛార్జీలు, మండల కమిటీ సభ్యులు టిడిపికి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని తెలిపారు. అధికారం ఉన్నా, లేకున్నా బీవీ కుటుంబం నిత్యం ప్రజల్లో ఉంటూ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారికి అన్ని విధాలా అండగా ఉంటున్నారని చెప్పారు. ఇప్పుడు కొంతమంది వైసిపి నాయకులతో కుమ్మక్కయి ఎమ్మిగనూరు సీటును బీసీలకు కేటాయించాలని సదస్సులు సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మరికొందరు ఏకంగా ఎమ్మిగనూరు టిడిపి సీటును అధినేత తనకే కేటాయించారని నియోజకవర్గంలో తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. ఇలా తప్పుడు ప్రచారం చేసుకుని తిరుగుతున్న వారికి కనీసం టిడిపి సభ్యత్వమైనా ఉందా అని ప్రశ్నించారు. టిడిపి అంటే క్రమశిక్షణకు మారు పేరని, అలాంటిది కనీసం సభ్యత్వం కూడా లేని వ్యక్తి నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. టిడిపి మండల ఉపాధ్యక్షులు అయ్యాలప్ప, మండల కమిటీ సభ్యులు రంగన్న, దేవదాసు, హనుమంతు, వీరనాగప్ప, లోకా రెడ్డి, రాఘవేంద్ర, నాగరాజు, మోకాసి రాఘవేంద్ర, విజయభాస్కర్ గౌడ్, లక్ష్మీనారాయణ, ఎలకన్న, ఈరన్న, ఖాజా, సోమేశ్వర రెడ్డి, డీలర్ ఈరన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్లపల్లి మల్లికార్జున

రమణీయం.. బసవేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని బాపురం గ్రామంలో వెలసిన ఉద్భవ మూర్తి బసవేశ్వర స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. ఉదయం నుంచే బసవేశ్వర స్వామికి ఆలయ పూజారుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళహారతి వంటి పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం సంధ్యా సమయంలో వేలాది మంది భక్తుల మధ్య బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి, టిడిపి నాయకులు పాల్ రెడ్డిలు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలూరు ఎస్ఐ ఓబులేసు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

27 నుంచి శ్రీశైలం భక్తులకు అన్నదానం

- అల్కూరు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మహాశివరాత్రి సందర్భంగా ఆదోని మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులందరికీ ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో బైపాస్ రోడ్డు ముందు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు అల్కూరు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. తమ కుటుంబ సభ్యులు, ఇతర దాతల సహాయ, సహకారాలతో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 2 వరకు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7989346355 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని రాఘవేంద్ర నగర్‌లో చోరీ కేసును చాకచక్యంగా 48 గంటల్లో ఛేదించినట్లు ఎస్ఐ నరసింహ రాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఈనెల 22న బాధితురాలు షాహీన్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి పర్యవేక్షణలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. శనివారం ఆదోనిలోని రిలయన్స్ ట్రెండ్స్ దగ్గర మహారాష్ట్రకు చెందిన సయ్యద్ ఇసాక్‌ను అరెస్టు చేసి రూ.4.80 లక్షల విలువ చేసే ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సిఎం హామీల అమలులో విఫలం

- ఈద్గా నిర్మాణానికి సొంత నిధులెందుకు

- టిడిపి నాయకులు ఉమ్మీ సలీమ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను రాబట్టడంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి విఫలం చెందారని టిడిపి నాయకులు ఉమ్మీ సలీమ్ విమర్శించారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీ, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చిత్రపటం ఉంచి మాట్లాడారు. 2022 సెప్టెంబర్ 5న విద్యా కానుక కిట్ల పంపిణీకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదోని పర్యటనకు వచ్చారని తెలిపారు. పట్టణంలోని రోడ్ల విస్తరణకు రూ.50 కోట్లు, తాగునీటి అవసరాల కోసం చెరువు నిర్మాణానికి రూ.80 కోట్లు, డిగ్రీ కళాశాల మంజూరు వంటి హామీలను ఇచ్చారని చెప్పారు. హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టేందుకు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదని విమర్శించారు. ప్రజా సమస్యల గురించి అసెంబ్లీలో గళమెత్తి మాట్లాడేందుకే ఓటు వేసి గెలిపించామని, అలాంటిది నోరు తెరిచిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ముస్లిం పేదలకు వివాహాలు చేసేందుకు టిడిపి హయాంలో షాదీఖానా మంజూరయిందని తెలిపారు. నిధులు లేకపోవడంతో భవనం అసంపూర్తిగా మిగిలిందన్నారు. నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా ఎమ్మెల్యే ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. ఈద్గా నిర్మాణం కోసం సుమారు రూ.2.60 కోట్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పడంతో అందరూ హర్షించారన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు నిర్మాణం మొదలు పెట్టి ఇప్పటివరకు రూ.80 లక్షలు ముస్లింలు ఖర్చు చేశారని తెలిపారు. ఈద్గా నిర్మాణానికి రెండేళ్లయినా ఇంతవరకు పైసా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాల్సిన ఎమ్మెల్యే నిర్మాణానికి ఆర్థిక సహాయం రూ.20 లక్షలు అప్పురూపంలో ఇస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. ముస్లింల నిబంధనల మేరకు ఇతరులు ఎలాంటి ఆర్థిక సహాయమూ చేయరాదని ఉందని, తెలిసి కూడా ముస్లిం పెద్దలు చప్పట్లు కొట్టడం సిగ్గుచేటని విమర్శించారు. ఓట్ల కోసమే రూ.20 లక్షల చెక్కు ఇచ్చారని, ముస్లింలు గమనిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మీ సలీమ్

ఏం చేశారని మీకు టికెట్ ఇవ్వాలి

- ఎంపిటిసి వెంకటేశ్వరమ్మ, వీరేష్

ప్రజాశక్తి - నందవరం


బోయ వీరేష్

2019 తర్వాత రాష్ట్రంలో పార్టీ ఓడిపోయి కార్యకర్తలు నాలుగున్నర ఏళ్లుగా ఇబ్బందుల్లో ఉంటే అప్పుడు మీరు (మాచాని సోమనాథ్) ఏం చేస్తున్నారని గురజాల ఎంపిటిసి బోయ వెంకటేశ్వరమ్మ, టిడిపి యువ నాయకులు మిట్టా సోమాపురం బోయ వీరేష్ ప్రశ్నించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో వారికి ధైర్యం చెప్పి 'నేనున్నా' అంటూ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ముందున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని కాదని, నెలరోజుల ముందు పార్టీలోకి వచ్చిన సోమనాథ్‌కు టికెట్ కావాలని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీకి టికెట్ అడగడం చాలా మంచిదని, కానీ ఇప్పుడు సరైన సమయం కాదని తెలిపారు. తాను కూడా బోయ సామాజిక వర్గానికి చెందిన ఒక బీసీనేనని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఏనాడూ ఓసీ అని ప్రవర్తించలేదని, తన కుటుంబ సభ్యుల్లాగా బీసీలను చూసుకున్నారని తెలిపారు. బీసీలను గౌరవించిన కుటుంబం ఏదైనా ఉందంటే అది కేవలం మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి కుటుంబమేనన్నారు. ఎప్పటికైనా బీసీలకు బీవీ అండగా ఉంటారని, బీవీకి బీసీలు అండగా ఉంటారని తెలిపారు. ఆయనను మరోసారి ఎమ్మెల్యేగా చేసి మంత్రిగా చూడడమే బీసీల లక్ష్యమన్నారు. ఎమ్మిగనూరు టికెట్ కోసం ఎవరెన్ని ప్రయత్నలు చేసినా టిడిపి అభ్యర్థిగా బీవీ.జయనాగేశ్వరరెడ్డి మరోసారి ఎన్నికల్లో నిలబడి, గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి

- టిడిపి జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి కోట్రేష్ గౌడ్

ప్రజాశక్తి - కౌతాళం

క్రీడారంగంలో గ్రామీణ యువత రాణించాలని టిడిపి జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి కోట్రేష్ గౌడ్ ఆకాంక్షించారు. శనివారం యువతకు క్రీడ సామగ్రిని (కిట్) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించాలని, ఎన్నో విజయాలు సాధించాలని తెలిపారు. ఉన్నత స్థానాలు అధిరోహించాలని, యువతకు ఎల్లప్పుడూ తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడు తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. చిరుతపల్లి శివప్ప గౌడ్, తిమ్మాపురం పెద్ద హుస్సేని, తిమ్మాపురం ఉల్లిగయ్య, రమేష్, వీరేష్, డి.హుస్సేని పాల్గొన్నారు.


క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న కోట్రేష్ గౌడ్

పేదల జీవితాల్లో వెలుగు నింపిన రామయ్య

- సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని

ఇల్లు లేని ఎందరో నిరుపేదలకు స్థలాలు ఇప్పించి జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు చదువుల రామయ్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. శనివారం ఆదోనిలోని సిపిఐ కార్యాలయంలో 32వ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. సుదర్శన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం వీరోచిత పోరాటాలు చేశారన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, సిపిఐ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, బసాపురం గోపాల్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఎంకన్న, ఒబి.నాగరాజు, షేక్షావలీ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు హర్షద్, కుమారస్వామి, నరసప్ప, రైతు సంఘం నాయకులు ఎల్లప్ప, వ్యకాస నాయకులు కొత్తూరు గంగన్న, మాజీ సర్పంచి హనుమంతు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

ఈనెల 27 నుంచి అన్నదానం

- ఆస్పరి సేవా సమితి సభ్యులు

ప్రజాశక్తి - ఆస్పరి

శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్ర వెళ్లే కర్ణాటక భక్తులకు ఈ నెల 27 నుంచి అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆస్పరి సేవా సమితి సభ్యులు శాంతప్ప, మహానంది, నాగేష్, రామ్ రెడ్డి, గాదిలింగప్ప తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. కర్ణాటక నుంచి శ్రీశైలానికి వచ్చే భక్తులకు 27 నుంచి మార్చి 2 వరకు 24 గంటలూ ఆస్పరిలోని కర్నూలు రోడ్డు పక్కన శ్రీపక్కిరప్ప తాత దేవాలయం ఆవరణలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్ర భక్తులకు జ్వరం, జలుబు, కాళ్ల నొప్పులు తదితర సమస్యలకు మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సమితి సభ్యులు బసవరాజు, రాము, వీరేష్, నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సేవా సమితి సభ్యులు



నిరసన గళం..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ నిరసన గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోఏఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ ఐక్య కార్యచరణ సమితిలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. కర్నూలులో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. అంతకు ముందు జిల్లా పరిషత్ నుంచి రాజ్ విహార్, బుధవార పేట మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్, 11వ పిఆర్‌సి, డిఎ బకాయిలు పేరిట రూ.30వేల కోట్ల మేరకు పెండింగులో ఉన్నాయని, తక్షణమే వాటిని చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ వేసినప్పటికీ అమలు కానందున నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోయిన కారణంగా వెంటనే 30 శాతం మధ్యంతర భృతి (ఐ.ఆర్)ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 70 ఏళ్ల వారికి 10శాతం, 75 పై బడ్డ వారికి 15 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భానుడి భగభగ..

ఫిబ్రవరి నెల ముగియకముందే భానుడు భగభగ అంటూ ప్రతాపం చూపుతున్నాడు. ఎండలు దంచి కొడుతుండడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. బయటికి వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం మొదలవుతోంది. గత మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండలు ఫిబ్రవరి నెలలోనే అమాంతంగా పెరిగిపోవడంతో మార్చి, ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. రేపటి నుంచి ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువ నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్థికంగా బలపడిన కుటుంబాలు ఎండ తాకిడిని తట్టుకోలేక ఇంటి దగ్గర ఉన్నా గడిచిపోతుంది. చిన్న పరిశ్రమల కార్మికులు, ఉపాధి హామీ పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. చిన్న పరిశ్రమల యాజమాన్యం, ఉపాధి హామీ అధికారులు ఎండ వేడి నుంచి కార్మికులను, కూలీలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవీ..ఇవీ..అన్నీ..

ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌లో చేర్చాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో భాగంగా ఆర్ఎఆర్ఎస్ గేటు మూసి వేసి నిరసన తెలిపారు. జిల్లా సీనియర్ మహిళ, పురుషుల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ఆదివారం ఎస్పీజీ క్రీడా మైదానంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ఆర్థికసాయం జమ చేశారు.



తొలి జాబితాలో తొమ్మిది మంది

- అభ్యర్థులను ప్రకటించిన టిడిపి, జనసేన - మిగిలిన స్థానాలపై ఉత్కంఠ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను శనివారం ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఆళ్లగడ్డ టికెట్‌ను భూమా అఖిలప్రియకు, శ్రీశైలం టికెట్‌ను బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, కర్నూలు టికెట్‌ను టిజి.భరత్‌కు, పాణ్యం టికెట్‌ను గౌరు చరితారెడ్డికి, నంద్యాల టికెట్‌ను ఎన్ఎమ్‌డి.ఫరూక్‌కు కేటాయించారు. బనగానపల్లె టికెట్‌ను బీసీ.జనార్ధన్ రెడ్డికి, డోన్ టికెట్‌ను కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డికి, పత్తికొండ టికెట్‌ను కెఇ.శ్యాంబాబుకు, కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ టికెట్లను ఆయా నియోజకవర్గాల టిడిపి సమన్వయకర్తలకే కేటాయించారు. డోన్‌లో గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్యాపిలి మండలం జలదుర్గం బాదుడే బాదుడు సభలో ధర్మవరం సుబ్బారెడ్డిని టిడిపి అభ్యర్థిగా ప్రకటించారు. ఆయనను గెలిపించాలని కోరారు. ధర్మవరం సుబ్బారెడ్డి స్థానంలో కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డిని తొలి జాబితాలో అభ్యర్థిగా ప్రకటించారు. ధర్మవరం సుబ్బారెడ్డి అయోమయంలో పడ్డారు. కోడుమూరు టికెట్‌ను కొత్తగా బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మిగిలిన స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఆదోనిలో నియోజకవర్గ సమన్వయకర్త మీనాక్షి నాయుడుతో పాటు చాలా మంది టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆలూరులో నియోజకవర్గ సమన్వయకర్తగా కోట్ల సుజాతమ్మ ఉన్నారు. తాజాగా డోన్ టికెట్‌ను కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి ప్రకటించడంతో ఆలూరు స్థానం ఎవరికి కేటాయిస్తారోనన్న సందిగ్ధం నెలకొంది. ఇంటికి ఒకే టికెట్ అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించడంతో ఆలూరు స్థానం కోట్ల సుజాతమ్మకు కాకుండా ఇతరులకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రాలయం టికెట్ ఇప్పటికే నియోజకవర్గ సమన్వయకర్త ప్యాలకుర్తి తిక్కారెడ్డికి ఖరారైనట్లు సమాచారం. రెండో జాబితాలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎమ్మిగనూరులో నియోజకవర్గ సమన్వయకర్తగా బివి.జయనాగేశ్వరరెడ్డి ఉన్నారు. దాదాపు ఆయనకే టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. నందికొట్కూరు స్థానానికి సంబంధించి ఎవరికి కేటాయిస్తారోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.


బీసీ.జనార్ధన్‌రెడ్డి


బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


గౌరు చరితారెడ్డి


భూమా అఖిలప్రియ


ఎన్ఎమ్‌డి.ఫరూక్


కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి


బొగ్గుల దస్తగిరి


టిజి.భరత్


కెఇ.శ్యాంబాబు

ఈవిఎంలపై సంపూర్ణ అవగాహన

- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ నుండి ఈవిఎంల తొలి ర్యాండమైజేషన్ పై సంపూర్ణ అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈవిఎంల ర్యాండమైజేషన్ డ్రై రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్ల వారిగా కేటాయించే ఈవిఎంల ర్యాండమైజేషన్ డ్రై రన్‌పై పూర్తి స్థాయి శిక్షణ పొందాలన్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి 2030 కంట్రోల్ యూనిట్లు, 2509 బ్యాలెట్ యూనిట్లు, 2452 వివి ప్యాట్లు, అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 1924 కంట్రోల్ యూనిట్లు, 2520 బ్యాలెట్ యూనిట్లు, 2451 వివి ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తి చేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా వున్న ఈవిఎంలను జిల్లా ఎన్నికల అధికారి లాగ్‌ఇన్‌లో తొలి ధపా ర్యాండమైజేషన్ జరుగుతుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి స్థాయిలో రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి అనంతరం పోలింగ్ కేంద్రాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.పద్మజ, అన్ని నియోజకవర్గాల ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఇఆర్ఒలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

నాలుగు రెట్లు నష్టపరిహారమివ్వాలి

- 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి
- సోలార్‌కు ప్రభుత్వమే భూసేకరణ చేపట్టాలి
- బాధిత రైతులను ఆదుకోవాలి
- ఎపి రైతు సంఘం డిమాండ్


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - పాణ్యం

సోలార్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి, ప్రైవేటు మార్కెట్ రేటుపై అదనంగా నాలుగు రెట్లు కలిపి నష్టపరిహారం ఇవ్వాలని, ప్రభుత్వమే భూ సేకరణ చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పాణ్యం మండలం కందికాయపల్లె గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాణ్యం మండలం ఆలమూరు, కందికాయపల్లె, బేతంచెర్ల మండలంలో ముసలాయి చెరువు గ్రామాలలో ఏఎంగ్రీన్ ఎనర్జీ కంపెనీ సోలార్ ప్రాజెక్టుకు 2500 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు, అందులో 700 ఎకరాలు భూమి ఆలమూరు, కందికాయపల్లి గ్రామాలలో రైతుల భూములను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. బేతంచెర్ల మండలం ముసలాయి చెరువు గ్రామంలో మరికొంత భూమిని సోలార్ ప్రాజెక్ట్ వారు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇక్కడ ప్రైవేట్ కంపెనీ వారు రైతుల భూములను కొల్లగొడుతుంటే ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు వారి దోపిడీకి సహకరిస్తున్నారని విమర్శించారు. చట్టాన్ని అమలు చేయకుండా ఎకరాకు పట్టా భూములకు రూ. 12 లక్షలు, డి పట్టా భూములకు రూ. 8 లక్షలు చొప్పున ధరలు వారే నిర్ణయించి రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా, గ్రామాల్లో ఎలాంటి గ్రామసభలు జరపకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పట్టా భూములకు మాత్రమే చెక్కులు ఇవ్వడం, రైతులు ఏదైనా అభిప్రాయం వ్యక్తం చేస్తే వారిని బెదిరించి ఈ డబ్బు, చెక్కులు తీసుకోకుంటే వచ్చే అవి కూడా రాకుండా పోతాయని బెదిరిస్తున్నారని అన్నారు. పూర్వీకుల కాలం నుంచి అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు ఎలాంటి నష్టపరిహారం ప్రకటించకుండానే భూమి స్వాధీనం చేసుకుంటున్నారని చెప్పారు. బాధిత రైతులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పట్టా భూములతో పాటు అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు కూడా సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని, పునరావసం కింద గ్రామ ప్రజలకు ఆర్థిక సాయం చేయాలని, గ్రామంలో ఉన్న 150 కుటుంబాలు భూమిలేని నిరుపేదలకు, చేతివృత్తుల వారికి చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ప్రసాద్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - బనగానపల్లె : కొలిమిగుండ్ల మండలం నాయునిపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో సిఎం సహాయ నిధి కింద మంజూరయిన రూ. 2 లక్షలు చెక్కును బనగాపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు సిఎం జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చదువుల రామయ్య ఆశయాలను సాధించాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల : కామ్రేడ్ చదువుల రామయ్య ఆశయాలను నేటి తరం సిపిఐ కార్యకర్తలు, యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తెలిపారు. సిపిఐ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ కార్యదర్శి చదువుల రామయ్య 32వ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం(స్వామి రెడ్డి భవన్)లో ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పూలమాల లేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సీనియర్ నాయకులు సంజీవులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు రాముడు, సిపిఐ నాయకులు మదిలేటి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నందవరం చౌడేశ్వరి దేవస్థానం ఇఒగా కామేశ్వరి

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానం ఈవోగా కామేశ్వరిని నియమించారు. శనివారం చౌడేశ్వరి దేవస్థానం ఆలయ ఈవోగా కామేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఆలయ ఈవో రామానుజన్ బదిలీ అయ్యారు. నూతన ఇఒ కామేశ్వరి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న ఈవో కామేశ్వరి

స్వామి అమ్మవార్ల కళ్యాణానికి నిశ్చితార్థ మండపం కరువు

- మార్చి 6 నుండి క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవ క్షేత్రం మహానందికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనార్థమై వస్తుంటారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానంది క్షేత్రంలో నిర్వహించే స్వామి అమ్మవార్ల కల్యాణంలో ముఖ్య ఘట్టం స్వామి అమ్మవార్ల నిశ్చితార్థం. స్వామి అమ్మవార్ల నిశ్చితార్థం నిర్వహించే మండపాన్ని కొన్ని దశాబ్దాల క్రితం దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి పూర్వీకులు, శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెందిన శివరామిరెడ్డి, పరమేశ్వర రెడ్డిల పూర్వీకులు నిర్మించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే చొరవతో క్షేత్ర సుందరీకరణలో భాగంగా 2023 సెప్టెంబర్‌లో నిశ్చితార్థ మండపం అడ్డు ఉందనే నెపంతో పాలక మండలి సమక్షంలో వేద పండితుల సలహాతో హడావిడిగా ఈవో ఆధ్వర్యంలో తొలగించారు. క్షేత్రంలో నిర్వహించే అత్యంత పెద్ద ఉత్సవం శివరాత్రి బ్రహ్మోత్సవాలు. 2024 మార్చి 6 నుండి శివరాత్రి బ్రహ్మోత్సవాల వేడుకలలో స్వామి అమ్మవార్లకు నిశ్చితార్థ మండపం లేకుండా చేయడం విడ్డూరమని స్థానికులు, భక్తులు విమర్శిస్తున్నారు. ఈ నిశ్చితార్థ మండపాన్ని తొలగించే సమయంలో శివరాత్రికి స్వామి అమ్మవార్ల కళ్యాణం నాటికి కొత్త మండపాన్ని నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. నేడు అధికారులు, పాలకమండలి సభ్యులు ఆ మండపం ఊసే ఎత్తకపోవడంతో భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది.


పురాతన నిశ్చితార్థ మండపాన్ని తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

నిశ్చితార్థ మండపానికి రెండ్రోజుల్లో భూమిపూజ



మహానంది క్షేత్ర సుందరీకరణలో భాగంగా స్వామివారి నిశ్చితార్థ మండపం తొలగించాం. దాతల సహకారంతో అన్ని హంగులతో 25 లక్షల వ్యయంతో నిశ్చితార్థ మండపాన్ని నిర్మించేందుకు రెండు రోజుల్లో దాతలతో భూమి పూజ చేయనున్నాం. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి కల్యాణంలో భాగంగా నిశ్చితార్థం మండపం తాత్కాలికంగా నిర్మించి పూజలు నిర్వహించి వచ్చే సంవత్సరం శివరాత్రికి అన్ని హంగులతో మండప నిర్మాణాన్ని పూర్తి చేస్తాం.

- కాపు చంద్రశేఖర్ రెడ్డి, మహానంది దేవస్థానం ఇఒ.

వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలి

- టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన వేల కోట్ల రూపాయల నిధులు దారి మళ్లించి రాష్ట్ర ముస్లిం, మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ముస్లిములంతా తగిన గుణపాఠం చెప్పాలని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం నంద్యాలలో జరిగిన ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి హజ్ హౌస్‌ల నిర్మాణం, వారికి సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి ముస్లిముల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తూ, నక్క వినయాలు వల్లిస్తూ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు మైనార్టీలకు ఇస్తానని చెప్పి మైనార్టీలను మోసం చేశారన్నారు. కేవలం ఈ ప్రభుత్వం ఆర్భాటాల ప్రభుత్వమని, రాష్ట్రానికి, ముస్లిం, మైనార్టీలకు ఒరగబెట్టింది ఏమీ లేదని, ఈ ప్రభుత్వం ముస్లింల ద్రోహి అని అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ముస్లింలు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ముస్లింల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ హమ్మద్

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

- ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వాటర్ ట్యాంక్ పిల్లర్ల కాంక్రీట్ పెచ్చులు ఊడిపోతున్నాయి. పిల్లర్ల నెర్రెలు చీలి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ప్రజలు ట్యాంక్ ఎప్పుడు కూలుతుం దోనని భయాందోళనకు గురవు తున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామపంచాయతీ అధికారులు నీళ్లను వదలడం లేదు. ట్యాంకు శిథిలావస్థకు చేరుకొని పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఇళ్ల మధ్యన వాటర్ ట్యాంకు ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు వాటర్ ట్యాంక్ కూలిపోకముందే తొలగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


శిథిలమైన వాటర్ ట్యాంకు

శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకును తొలగించాలి



ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకును గ్రామపంచాయతీ అధికారులు తొలగించాలి. వాటర్ ట్యాంక్ కూలి ఇండ్లపై పడకముందే అధికారులు స్పందించి తొలగించాలి.

- రాయలసీమ సలాం.

అభ్యర్థుల ఖరారుతో టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లాల్లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు టిడిపి, జనసేన పార్టీల అధిష్టానం ఉమ్మడిగా అభ్యర్థుల పేర్లు ప్రకటించింది. నంద్యాల స్థానానికి ఎన్ఎండి ఫరూక్, బనగానపల్లె బిసి.జనార్ధన్ రెడ్డి, శ్రీశైలం బుడ్డా రాజశేఖర్ రెడ్డి, డోన్ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆళ్లగడ్డ భూమా అఖిలప్రియ, పాణ్యం గౌరు చరితారెడ్డిలకు టికెట్లు కేటాయించారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

నంద్యాల ఎమ్మెల్యేగా బహుమతిగా ఇస్తాం : ఎన్ఎండి ఫరూక్

నంద్యాల కలెక్టరేట్ : టిడిపి నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో నంద్యాల ఎమ్మెల్యేగా తప్పకుండా గెలిచి చంద్రబాబు నాయుడికి బహుమతిగా అందిస్తామని ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇరువురు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి కూటమి నుండి పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్ఎండి ఫరూక్‌ను ప్రకటించడంతో పార్టీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. నంద్యాలలోని పలు వార్డుల్లో, ముఖ్య కూడళ్లలో బాణసంచా కాల్చుతూ, స్వీట్లు పంచుతూ, బైక్ ర్యాలీలు చేపట్టి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ టిడిపి అధిష్టానం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నంద్యాలలో పార్టీ జెండాను రెపరెపలాడిస్తామన్నారు. నంద్యాలలో జరిగిన ప్రతి అభివృద్ధి టిడిపి హయాంలోనే జరిగిందని, ఈ సారి ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు నాయుడికి బహుమతిగా అందిస్తామని తెలిపారు. గత 42 ఏళ్లుగా పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు. 20 ఏళ్ల తర్వాత నంద్యాల ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పకుండా టిడిపిని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని, 20 ఏళ్ల శిల్పా కుటుంబ అరాచక పాలనను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపాఉరు. ఈ సందర్భంగా **మిగతా 6వ పేజీలో...**



నంద్యాలలో ఎన్ఎండి ఫరూక్‌కు స్వీట్ తినిపిస్తున్న నాయకులు



ఆత్మకూరులో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్న టిడిపి నేతలు



నందికొట్కూరులో..



ప్యాపిలిలో..సంబరాలు జరుపుకున్న టిడిపి నేతలు

అభ్యర్థుల ఖరారుతో టిడిపి శ్రేణుల సంబరాలు

5వ పేజీ తరువాయి.. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్ఎండి ఫరూక్‌ను, వారి తనయుడు ఎన్ఎండి ఫిరోజ్‌ను ఆత్మీయంగా కలిసి వారికి హదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

బనగానపల్లె టిడిపి శ్రేణుల సంబరాలు

బనగానపల్లె : బనగానపల్లె టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేరును అధిష్టానం మొదటి జాబితాలో ప్రకటించడంతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బనగానపల్లె కోటపై టిడిపి జెండాను ఎగరవేసి బిసి జనార్దన్ రెడ్డిని గెలిపించి పార్టీకి బహుమతిగా ఇస్తామని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. బిసి జనార్దన్ రెడ్డి 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు .2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో బీసీ జనార్దన్ రెడ్డి ఓడిపోయినా కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. దీంతో 2024లో టిడిపి అభ్యర్థిగా అధిష్టానం బీసీ జనార్దన్ రెడ్డిని ప్రకటించింది.

ఆళ్లగడ్డ టపాసులు కాల్చిన భూమా అఖిలప్రియ అభిమానులు

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియను ఖరారు చేస్తూ అధిష్టానం ప్రకటించింది. ఆళ్లగడ్డ టికెట్‌పై కొన్ని రోజుల నుంచి నెలకొన్న ఉత్కంఠతకు తెరపడింది. అఖిలప్రియ పేరును ఖరారు చేయడంతో ఆమె ఇంటి ఎదుట, సత్రం వీధిలో అభిమానులు టపాసులు కాల్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ భాషా, నన్నేబై గారి జిలానీ, సగిలి శ్రీనివాస రెడ్డి, కోటపటి ప్రసాద్, సోముల లక్ష్మీనారాయణ రెడ్డి, సల్లే పల్లె వెంకటరామిరెడ్డి, నల్లగట్ల గుర్రప్పలు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ లకు కతజ్ఞతలు తెలిపిన అఖిలప్రియ : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఖరారు చేసినందుకు మాజీ మంత్రి అఖిలప్రియ టిడిపి జాతీయ అధ్యక్షులు, చంద్రబాబు, జాతీయ కార్యదర్శి లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆళ్లగడ్డలో టిడిపి విజయ కేతనం ఎగురవేస్తామన్నారు. నియోజకవర్గంలో టిడిపి విజయం ఖాయమని ఆమె స్పష్టం చేశారు.

ఆత్మకూరు : శ్రీశైలం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బుడ్డా రాజశేఖర్ రెడ్డిని ఆ పార్టీ ప్రకటించడంతో శ్రీశైలం నియోజక వర్గంలో పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా బాణాసచారాన్ని కాలుస్తూ. స్వీట్లను పంపిణీ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. శ్రీశైలంలో 2019 నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ఈ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎప్పటి కప్పుడు వ్యతిరేకిస్తూ పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించడంతోపాటు గత కొద్ది సంవత్సరాల నుండి పార్టీ బలోపేతం కావడం సర్వే సైతం బుడ్డా రాజశేఖర్ రెడ్డికి అనుకూలంగా రావడం హర్షణీయం అని కార్యకర్తలు పేర్కొన్నారు. **నందికొట్కూరు :** పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించడాని హర్షిస్తూ నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్ నందు బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, పలుచాని మహేశ్వర్ రెడ్డి, ముత్తు జావలి, షకీల్ అహ్మద్,కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి,నిమ్మకాయల మోహన్, రాజు, కళాకర్, బో ల్లెద్దుల రాజన్న, సామేలు,రగడ, బాబు,మౌలానా అబ్దుల్ మోలిసా, బాలకృష్ణ ఫాన్స్ తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలిలో** టిడిపి శ్రేణులు ప్రధాన కూడళ్ల వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ తొప్పేల శ్రీనివాసులు మాట్లాడుతూ సూర్య ప్రకాష్ రెడ్డిని డోన్ నియోజక వర్గం టిడిపి అభ్యర్థిగా ప్రకటించినందుకు చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోవు ఎన్నికలలో కోట్ల, కెఇ కలయికతో డోన్‌లో టిడిపి జెండా ఎగరేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోతొప్పేల వెంకటేష్, రాంమోహన్ యాదవ్, కృష్ణమోహన్, మల్లికార్జున, రమేష్, వెంకటేష్,గోపాల్, ప్రిన్సిపాల్ మధు, అర్జున్,రామదాసు, సుధ, సుధాకర్,శేగు,శివ,సుంకన్న,కుమార్, రామకృష్ణ, బాలకృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.







ఆళ్లగడ్డ : టపాసులు కాలుస్తున్న అభిమానులు



సమావేశంలో మాట్లాడుతున్న నర్రెడ్డి తులసిరెడ్డి

నెంబర్ వన్ ద్రోహి బిజెపి : కాంగ్రెస్

ప్రజాశక్తి - చాగలమర్రి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం, మోసం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పిఎస్ డాభా వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హెూదాకు పంగ నామాలు పెట్టిందని,కడప స్టీల్ ప్యాక్టరీకి, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజికి తిలోదకాలిచ్చిందని విమర్శించారు. అలాగే పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిందని,విభజన చట్టంలోని అంశాలను చాలామటుకు అమలు చేయలేదన్నారు.అటువంటి బిజెపి ప్రాపకం కోసం రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు వైకాపా, టిడిపి, జనసేనలు ప్రాకులాడడం సిగ్గుచేటన్నారు. బిజెపి చేతిలోపై మూడు పార్టీలు కీలుబొమ్మలు,బానిసలుగా మారాయని ధ్వజమెత్తారు. ప్రత్యేక హెూదా రావాలన్నా, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి నిధులు రావాలన్న, విభజన చట్టంలోని అంశాలు అమలు కావాలన్నా అది ఒక కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్,వామపక్షాల పొత్తు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి అవసరమన్నారు. ప్రజా సమస్యలపై వామపక్షాల అలుపెరుగని పోరాటం చేస్తున్నాయని ఆయన కితాబు ఇచ్చారు. కాంగ్రెస్,వామపక్షాల పొత్తులో దుష్ట చతుష్టయ పార్టీలైన బిజెపి,వైకాపా,టిడిపి,జనసేనలు చిత్తు కాక తప్పదని ధీమా వ్యక్తం చేసారు. ఈ నెల 26న అనంతపురంలో జరిగే ఎన్నికల శంఖారావం బహిరంగ సభలో భారీగా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నంద్యాల జిల్లా కార్యదర్శి మహబూబాబాషా (పాపాజీ), కాంగ్రెస్ నాయకులు,అబ్దుల్ రజాక్,సాధిక్,అన్నమయ్య జిల్లా పుంగ నూర్ కన్వీనర్ సింగం రామక్రిష్ణారెడ్డి,కడప జిల్లా నాయకులు అమర్,ఉత్తన్న,సుబ్బరాయుడు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణ సభను విజయవంతం చేయండి : ఇబ్రహీం

ఆత్మకూర్ : ఈనెల 26వ తేదీన అనంతపురంలో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెహమాన్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఇబ్రహీం అన్నారు. ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు వారు మాట్లాడుతూ మొన్న కర్ణాటకో కాంగ్రెస్, నిన్న తెలంగాణలో కాంగ్రెస్, రేపు ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అహమ్మద్ హుస్సేన్, జిల్లా సలహా కార్యదర్శి రెహమాన్, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ జైలన బాషా మండల అధ్యక్షులు శివశంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు ఇబ్రహీం

పైప్‌లైన్ లీకేజీ చేసే వారిపై చర్యలు తీసుకోండి

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి డోన్‌కు వచ్చే మంచినీటి పైప్ లైన్ లీకేజీ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. శనివారం డోన్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డికి చైర్మన్ సప్తశైల రాజేష్, డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాంలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ మాట్లాడుతూ అనునిత్యం డోన్ పట్టణానికి వచ్చే మంచినీటి పైప్‌లైన్‌ను తరచుగా లీకేజీలు చేస్తున్నారని లీకేజీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంచినీటి పైప్ లైన్ లీకేజీ కారణం వలన డోన్ పట్టణానికి అందించే మంచి నీరు మరమ్మత్తులు చేయడానికి మూడు రోజులు సమయం పడుతుందని అందువల్ల పట్టణానికి మంచినీరు అందించడానికి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. గతంలో ఎప్పుడో ఒకసారి లీకేజీ సమస్యలు ఉండేవని ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ లీకేజీ అవుతుండడం వల్ల డోన్ పట్టణ ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయని వాటిని దృష్టిలో ఉంచుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



డిఎస్పి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న సప్తశైల రాజేష్

బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో జరగబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు కర్నూలు జిల్లా లోకాయుక్త జడ్జి లక్ష్మారెడ్డి, ఉపలోకాయుక్త జడ్జి పగిడి రజిని, కర్నూలు జిల్లా జడ్జి ఎన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపి.టీజీ వెంకటేష్, పోగుల మహేశ్వర్ రెడ్డిలను ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అధికారులు శనివారం వెళ్ళి మహానందీశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేసారు. అనంతరం వేద పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనాలు చేసి, స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు ప్రాతకోటలో నవగ్రహ మండపం ఉద్ధరణ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో శ్రీ నాగేశ్వర స్వామి ఆలయం అందు నవగ్రహ మంటప ఉద్ధరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తూర్పు ప్రాతకోట గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దక్షిణ భారతదేశంలోనే బ్రహ్మసూత్ర లింగాలలో ఒకటిగా పేరుగాంచిన తూర్పు ప్రాతకోట గ్రామంలో వెలసిన శ్రీ నాగేశ్వర దేవాలయంలో మార్చి నెల 1 తేదీ నుంచి 3వ తేదీ వరకు నవగ్రహ మంటప కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి జగదీశ్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు చండీ ఉపాసకులచే ఆచార్యత్వమున నిర్వహిస్తున్నట్లు వారు నవగ్రహ మంటప ఉద్ధరణ కు భక్తులు పాల్గొనవలసిందిగా వారు కోరారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యల : డిఎస్‌పి

- వాడాలలో పల్లె నిద్ర

ప్రజాశక్తి పాములపాడు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ఆత్మకూరు డిఎస్పి ఎ. శ్రీనివాసులు సూచించారు. పాములపాడు మండలం వాడల గ్రామంలో శనివారం ఎస్సై జి అశోక్ ఆధ్వర్యంలో రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసులు, సిఐ నాగభూషణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్‌పి చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎవరు అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు వివాహం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సైబర్ నేరాల పట్ల రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రజలు ఎప్పటికప్పుడు పోలీసులకు సహకరించాలని ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు పోలీసు వారికి సమాచారం ఇవ్వాలి అన్నారు.




గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

సమస్యలపై స్పందించని ఎమ్మెల్యే

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

తాలూకాలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే స్పందించడం లేదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. చాలుమర్రి మండలం మల్లె వేముల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఈదుల శంకర్ రెడ్డి, నంది వాహన రెడ్డి, విగ్నేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సాంబశివరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి లతోపాటు మరో 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరికి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనలో విసిగిపోయిన ప్రతి ఒక్కరి మనసులో నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకో వాలన్న తపన బలంగా ఉందని అన్నారు. తాలుకాలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతుంటే ప్రజా ప్రతినిధులు. పండగలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాలూకా నాయకులు భార్గవ్ రామ్, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సెగ్న రెడ్డి, టిడిపి నాయకులు కొలిమి మాబు షరీఫ్ , మౌలాలి ఖలీల్ , హనీఫ్ ,ముల్లా అబ్దుల్లా, జెట్టి నాగరాజు, బషీర్, కొలిమి షబ్బీర్, కొలిమి ప్రతాప్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, శేఖర్ రెడ్డి, అష్రాఫ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి భూమా అఖిల ప్రియా

అరాచక పాలనకు అంతం తథ్యం

మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - వెలుగోడు

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం తథ్యమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం టీడీపీ వెలుగోడు మండలం బోయరేవుల గ్రామంలో వైసీపీని వీడి 500 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బోయరేవుల సర్పంచ్ నాగనంది పెద్ద స్వామన్న భారీ అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. బడుగు, బలహీన వర్గాలను ఈ ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల నుంచి జరుగు తున్న విధ్వంస, అరాచక పాలనను అంతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని రాష్ట్ర ప్రజలు తమ ఓటు హక్కుతో భూస్థాపితం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కె.వి సుబ్బారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం కెవిఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య చాలా కీలకమైనదని ప్రతి ఒక్కరూ బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రణాళికతో చదివితే దేనినైనా సాధించవచ్చు అన్నారు. కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని.. అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు, విద్యా సంస్థల డైరెక్టర్ ఓబన్న, విద్యా సంస్థల డైరెక్టర్లు భూమా శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణారెడ్డి అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశ్వర్ రెడ్డి

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆళ్లగడ్డ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నంద్యాలలోని శ్రీరామలింగారెడ్డి కళాశాల మైదానంలో జరిగిన 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఆళ్లగడ్డ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఆళ్లగడ్డకు చెందిన విశ్వశాంతి స్కూల్, ఎస్ఆర్‌కె స్కూల్ క్రీడాకారులు మూడో స్థానం సాధించి కాంస్య పథకం అందుకున్నారు. నంద్యాల జిల్లా జట్టులో పాల్గొని జట్టును విజయపథం నడిపి ంచడంలో ప్రముఖ పాత్ర వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాగ్ సెక్రెటరీ రామాంజనేయులు, జిల్లా సెక్రటరీ మహమ్మద్ బాషా, రామలింగారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, కోచ్ డిపి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సమీ పుట్టినరోజు

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక మెయిన్ బజార్ లోని టిడిపి కార్యాలయంలో చాగలమర్రి మాజీ సర్పంచ్, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష తనయుడు టిడిపి యువ నాయకులు ముళ్ళ సమీ యుద్దీన్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భ ంగా సమీరుద్దీన్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు అభిమానులకు తినిపిం చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి కొలిమి మాబు షరీఫ్ మౌలాలి, ముల్ల అజీమ్, కొలిమి హుస్సేన్, కొలిమి మా బాష, కొలిమి సున్ని, ఎంఎస్ అజిముద్దీన్, ఎంఎస్ అలీమ్, జట్టి నాగరాజు, ఖాదర్, హనీష్, బషీర్, కొలిమి షబ్బీర్, కొలిమి అష్రాఫ్, సోను, హుస్సేన్ పీరా షబ్బీర్, జహీర్, గౌసులాజం, శక్షావలి, రాజేష్ రఫీ, ఫిరోజ్ మా బు హుస్సేన్‌లు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

కుక్క కాటుకు బాలుడు మృతి

ప్రజాశక్తి - వెలుగోడు

కుక్కకాటుకు గురై జ్వరం బారిన పడిన బాలుడు మృతి చెందిన ఘటన వెలుగోడు పట్టణంలో చోటు చేసు కుంది. పట్టణంలోని 10వ వార్డు పరిధిలో గత నెల 29వ తేదీన ఒక్కరోజులోనే దాదాపు 12 మంది కుక్క కాటు బారిన పడినారు. కుక్క కాటుకు గురైన బాధితుల్లో 6 సంవత్సరాల బాలుడు శని వారం మృతి చెందడంతో వెలుగోడు పట్టణంలో విషాదం అలము కుంది. పట్టణానికి చెందిన హుస్సేన్ బాషా ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. హుస్సేన్ బాషా కొడుకు అష్రఫ్ అలీ గత మూడు రోజుల నుంచి జ్వరం బారిన పడడంతో కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసు పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులను ఎస్‌డిపిఐ పార్టీ నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఎస్‌డిపిఐ నాయకులు మాట్లాడుతూ సంబం ధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



అష్రఫ్ అలీ కుక్కకాటుకు గురైనప్పటి ఫోటో



అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

కొలనుభారతిలో అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొలను భారతి క్షేత్రంలో అక్షరాభ్యాసాల వేడుకలు జరిగాయి. శనివారం పున్నమిని పురష్కరించుకొని అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు ఆలయ పురోహితులు నిర్వహించారు. పలు ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ముందుగా కొలనుభారతి దేవి అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించి విశేష పూజకార్యక్రమాలు చేసుకొన్నారు. అక్కడే ఉన్న సప్తశివాలయాలను దర్శించుకోవడం జరిగింది. అనంతరం చిన్నారులకు కుటుంబ సమేతంగా చిన్నారులతో బియ్యం నందు భీజాక్షరాలు దిద్దించి, పలక బలపం పట్టించి ఓం సరస్వతి నమస్తుభ్యం అని రాయించి అక్షరాభ్యాసాలు చేశారు. సుమారు 22 అక్షరాభ్యాసాలు అమ్మవారి సన్నిధిలో జరిగాయి.

నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో గత రెండు సంవత్సరాలగా దొంగతనానికి పాల్పడుతున్న వారిని అరెస్టు చేసినట్లుగా శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను హటకేశ్వరం వద్ద అరెస్టు చేయగా వారివద్ద నుండీ లక్ష రూ. 35000 నగదును, 3.5 తులాల బంగారంను, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టుగా వారు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో ఒకరు మైనర్‌గా మరొకరు శివ (22) ఆటో డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లుగా సీఐ తెలిపారు.



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

మహారాజ శ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.89/2021

కర్ణ కామేశ్వరి. ...వాది

వర్సెస్

1) తిరువపాటి వెంకటరాముడు Died by his Lr's
తిరువపాటి వెంకటేశ్వర్లు & ఇతరులు. ...ప్రతివాదులు

3వ ప్రతివాది

తిరువపాటి మహాలక్ష్మి వయసు 45 సం.తండ్రి లేట్ తిరువపాటి వెంకటరాముడు
ఇంటి నెంబర్.26-328-D, విశ్వాసపురం,
ఎదురు గా సెవెంత్ డే చర్చ్, రైల్వే స్టేషన్ రోడ్
నంద్యాల టౌన్ & నంద్యాల జిల్లా. ...ప్రతివాది

3వ ప్రతివాది కి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతివాది పై దావా దాఖలు చేసి ఉంది. దావా మొత్తం డబ్బులు రాగోరి ఇంటి పై అటాచ్మెంట్ అయి ఉంది. దావా మొత్తం అసలు వడ్డీ కలిపి,3,42,800/- రూపాయలు మొత్తం రాగోరి. 3 వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ 7-3-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీపరోక్షంగా తీర్మా నించబడునని మీకు తెలియజేయడ మైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ. 7-3-2024

ఇట్లు
దాసరి చిన్న లింగమయ్య,
వాది పరం అడ్వకేట్, నంద్యాల

మహారాజ శ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.533/2021

దూదేకుల శివశంకర్ బాబు. ...వాది

వర్సెస్

V. సంధ్యారాణి Died by his Lr's
D1) V.రఘుపతి S/o రఘుపతిరావు,
H-No :25-450-2B-139, YSR నగర్,
నంద్యాల టౌన్, & జిల్లా.
D3. V. నాగేంద్రనాథ్ 3rd ప్రతివాది మైనర్
Rep. by its natural Garden father i.e.
1st.ప్రతివాది ...ప్రతివాది

1వ ప్రతివాది కి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతివాది పై దావా దాఖలు చేసి ఉంది. దావా మొత్తం డబ్బులు రాగోరి ఇంటిపై అటాచ్మెంట్ అయి ఉంది. దావా మొత్తం అసలు వడ్డీ కలిపి,4,97,866/- రూపాయలు మొత్తం రాగోరి. 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశ పూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ: 13-3-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియ జేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ. 13-3-2024

ఇట్లు
దాసరి చిన్న లింగమయ్య,
వాది పరం అడ్వకేట్స్, నంద్యాల.

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

O. S. No. 192/2021

బండారు సంగీత. ...వాది

V/S

షేక్ సిరజ్ & ఇతరులు. ...ప్రతివాదులు
D2) షేక నూర్ బాష తండ్రిబీ అబ్బుల్ ఖాన్,
ఇంటి నం: 3-86, బసవేశ్వర స్వామి గుడి
ఎదురుగా,నంద్యాల టౌన్ & జిల్లా. ...ప్రతివాది

2వ ప్రతివాదికి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతి వాదులు అయిన మీ పైన దావా బాపత్తు మొత్తము రాగోరి కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. అందులో 2 వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు కొరకై 21-03-2024 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. పై అమలు దావా సంబంధించి, మీకుఎటువంటి అభ్యంతరములు ఉన్న యడల 21-03-2024 వ తేదీ ఉదయం 10.30గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆకేపణలను తెలుపుకోనవలేను. లేనియెడల పై కోర్టు వారు మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 21-03-2024

ఇట్లు
అడ్డగాళ్ళ వెంకటేశ్వర్లు,
వాదిపరం అడ్వకేట్, నంద్యాల
సెల్ నెం. 9440290132.

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

O. S. No. 201/2021

సంబవరపు బుజ్జి. ...వాది

V/S

ఎం.శ్రీనివాసులు, తండ్రి. సిద్దయ్య ఇంటి నెం. 3 -14,
చైనా బజార్ ,నంద్యాల టౌన్ & జిల్లా. ...ప్రతి వాది

ప్రతివాదికి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతి వాదులు అయిన మీ పైన దావా బాపత్తు మొత్తము రాగోరి కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. అందులో మీకు దావా సమన్లు ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు కొరకై 21-03-2024 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. పై అమలు దావా సంబంధించి, మీకుఎటువంటి అభ్యంతరములు ఉన్న యడల 21-03-2024 వ తేదీ ఉదయం 10.30గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆకేపణలను తెలుపుకోనవలేను. లేనియెడల పై కోర్టు వారు మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 21-03-2024

ఇట్లు
అడ్డగాళ్ళ వెంకటేశ్వర్లు,
వాదిపరం అడ్వకేట్, నంద్యాల
సెల్ నెం. 9440290132.

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

O. S. No. 141/2020

కొండుపల్లి పలుకూరు సుబ్రహ్మణ్యం. ...వాది

V/S

మధుగుండు శ్రీనివాసులు, తండ్రి సిద్దయ్య, ప్లాట్
H.No.25-419-A-1384-2, నందమూరి నగర్ శాంతి
రామ్ సేవా సమితి హాస్పిటల్ ఎదురుగా, నంద్యాల
టౌన్ & జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతి వాదులు అయిన మీ పైన దావా బాపత్తు మొత్తము రాగోరి కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. అందులో మీకు దావా సమన్లు ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు కొరకై 11-03-2024 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. పై అమలు దావా సంబంధించి, మీకుఎటువంటి అభ్యంతరములు ఉన్న యడల 11-03-2024 వ తేదీ ఉదయం 10.30గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆకేపణలను తెలుపుకోనవలేను. లేనియెడల పై కోర్టు వారు మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 11-03-2024

ఇట్లు
అడ్డగాళ్ళ వెంకటేశ్వర్లు,
వాదిపరం అడ్వకేట్, నంద్యాల
సెల్ నెం. 9440290132.